PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 210 | పేజీలు : 8 | వెల రూ.5 | సోమవారం 24.08.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




# తెలంగాణ రైజింగ్‌కు ప్రవాసులు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి

## లండన్‌లో తెలుగు ప్రవాసులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమావేశం

ప్రభాత సూర్యుడు, లండన్, ఆగస్టు 23:
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలుగు ప్రవాసులకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, భవిష్యత్ ప్రగతిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని, రాష్ట్రానికి బలమైన మద్దతుదారులుగా, బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదివారం లండన్‌లోని తెలుగు ప్రవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రవాసులతో ఆత్మీయంగా ముచ్చటించిన ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రణాళికలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యాలపై వారితో విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను సాధించడంలో రాష్ట్రంలో నివసిస్తున్న ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రవాసుల పాత్ర కూడా కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, విద్య, సాంకేతికత, ఉపాధి, ఆవిష్కరణలకు మరిన్ని అవకాశాలను తీసుకురావడంలో ప్రవాసులు తమ పరిచయాలు, అనుభవం, నైపుణ్యాలను వినియోగించుకోవాలని సూచించారు.




### తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసుల భాగస్వామ్యం

తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు, కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు, సాంకేతిక మరియు విద్యా రంగాల్లో భాగస్వామ్యాలను పెంచేందుకు ప్రవాసులు కృషి చేయాలని సూచించారు. తెలంగాణలోని ప్రతిభావంతులైన యువతకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించడంలోనూ ప్రవాసులు తమ వంతు సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలు తమ రంగాల్లో సాధించిన అనుభవాన్ని రాష్ట్ర అభివృద్ధికి అనుసంధానం చేస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

### ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ రైజింగ్‌కు ప్రచారం

తెలంగాణ రైజింగ్‌ను కేవలం రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమంగా కాకుండా, తెలంగాణ భవిష్యత్ ప్రగతికి సంబంధించిన విస్తృత లక్ష్యంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. లండన్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రవాసులు తెలంగాణ రైజింగ్‌కు బలమైన మద్దతుదారులుగా నిలిచి, రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి అవకాశాలను అంతర్జాతీయ వేదికలపై ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రవాసులు తెలంగాణ అభివృద్ధి, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్ర ప్రగతికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, ప్రవాస తెలంగాణ సమాజం మధ్య మరింత సమన్వయం పెరిగితే రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, సాంకేతిక భాగస్వామ్యాలు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంలో లండన్‌లోని తెలుగు ప్రవాసుల భాగస్వామ్యం కీలకంగా ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ, తెలంగాణ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ ప్రయాణికులకు కొత్త రూల్

## సెప్టెంబర్ 1 నుంచి బోర్డింగ్ పాస్‌పై స్టాంపింగ్‌కు స్వస్తి




ఢిల్లీ – ప్రభాత సూర్యుడు:
అంతర్జాతీయ విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. సెప్టెంబర్ 1, 2026 నుంచి దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తప్పనిసరిగా సమర్పించి దానిపై స్టాంప్ వేయించుకోవాల్సిన నిబంధనను తొలగించనున్నారు. బదులుగా ప్రయాణికులు తమ ఈ-బోర్డింగ్ పాస్‌ను ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద చూపించవచ్చు. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ తీసుకున్న ఈ నిర్ణయం సెప్టెంబర్ 1 నుంచి దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అమల్లోకి రానుంది. ఇప్పటికే ప్రింటెడ్ బోర్డింగ్ పాస్‌తో వచ్చే ప్రయాణికులు దానిని ఉపయోగించుకోవచ్చు. అయితే ఇకపై దానిపై ఇమ్మిగ్రేషన్ స్టాంప్ వేయడం తప్పనిసరి కాదు. ప్రయాణికులకు ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయడం, అనవసరమైన ఆలస్యాలను తగ్గించడం, బోర్డింగ్ పాస్‌లపై తప్పుగా లేదా సరిగా స్టాంపులు పడటం వల్ల ఏర్పడే సమస్యలను నివారించడం ఈ మార్పు ప్రధాన ఉద్దేశంగా అధికారులు పేర్కొన్నారు. దీంతో విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు విమానాశ్రయంలో మరో అడుగు తగ్గనుంది. డిజిటల్ విధానంలో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసే చర్యల్లో భాగంగా ఈ మార్పు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో నేటి నుంచి ఆటోలు, క్యాబ్‌ల బంద్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు ఆగస్టు 23:
తెలంగాణ వ్యాప్తంగా ఆటో, క్యాబ్ డ్రైవర్లు అర్ధరాత్రి నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. డ్రైవర్ల సంక్షేమం, తమ సమస్యల పరిష్కారం కోసం పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచిన డ్రైవర్ సంఘాలు, డిమాండ్లు నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశాయి. డ్రైవర్ల సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా రోజువారీ ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. డ్రైవర్లకు ప్రతి ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే డ్రైవర్ల సంక్షేమం, రక్షణ కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు, క్యాబ్‌లకు సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని డ్రైవర్ల సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని డ్రైవర్ల సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. దీంతో సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కొండా సురేఖపై వేటు మెజారిటీ ఎమ్మెల్యేల పట్టు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆమెపై మెజారిటీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నట్లు, మంత్రి పదవి నుంచి తప్పించాలని అధిష్టానానికి తమ అభిప్రాయాలను తెలియజేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ విషయంలో పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలను తెలుసుకునేందుకు అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీలో నెలకొన్న పరిణామాలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

### ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అభిప్రాయ సేకరణ

మంత్రి కొండా సురేఖ పనితీరు, పార్టీ వ్యవహారాల్లో ఆమె పాత్ర, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు సమాచారం. ముఖ్యంగా మెజారిటీ ఎమ్మెల్యేలు ఆమెపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు నేతలు మంత్రి పదవి నుంచి ఆమెను తప్పించాలని అధిష్టానానికి సూచించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. అభిప్రాయ సేకరణ పూర్తయిన తర్వాత పార్టీ నాయకత్వం పరిస్థితిని సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

### ఖర్గేతో భేటీ.. తాజా పరిణామాలపై వివరణ

ఈ పరిణామాల మధ్య మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత పరిస్థితులు, పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఆమె ఖర్గేకు వివరించినట్లు సమాచారం. అనంతరం మంత్రి మధ్యాహ్నం బెంగళూరుకు వెళ్లినట్లు తెలుస్తోంది. మంత్రి తనపై వస్తున్న ఆరోపణలు, పార్టీ అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలు, తన రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో అధిష్టానం పెద్దలను కలిసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### రేవంత్‌రెడ్డి రాక తర్వాత కీలక నిర్ణయం?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం రాష్ట్రానికి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యమంత్రి అభిప్రాయంతో పాటు అధిష్టానం సేకరించిన ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం మంత్రి కొండా సురేఖ విషయంలో కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే ఆమెపై చర్యలు ఉంటాయా? మంత్రి పదవిలో కొనసాగిస్తారా? అన్నది అధిష్టానం నిర్ణయంపై ఆధారపడి ఉంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ అంశంపై జరుగుతున్న చర్చలు రాజకీయ వర్గాల్లోనే పరిమితమయ్యే అవకాశం ఉంది.



